




నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నెల్లూరు : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒంటిపూట బడులు నిర్వహించకుండా మొండిగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం నగరంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ అధ్యక్షులు ఎం.శ్రీహర్ష అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు (పాఠశాలలు) ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రెండు పూటలా తరగతులు నిర్వహిస్తు న్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటాచలం కార్యదర్శి పి కిరణ్, ఆత్మకూరు కార్యదర్శి బి బాలాజీ, నగర కార్యదర్శి వి నరేంద్ర, కె పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

టిడిపిలో ఉత్సాహం..ఉత్కంఠ..!

టిడిపిలో ఎంఎల్‌సి ఎన్నికల ఉత్సాహం నింపాయి. 2024 ఎన్నికలకు నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేయడానికి జోన్-4 సమావేశాన్ని నేడు నగరంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐదు జిల్లాల నుంచి 35 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 2500 మంది ముఖ్యనేతలు హాజరుకానున్నారు. స్థానిక వేణు గోపాలస్వామి కాలేజీలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం నిర్వహించనున్నారు. విజయాలపై ఉత్సాహం ఉన్నా ఆపార్టీ క్యాడర్, ఇతర పార్టీల నుంచి వలస వస్తున్న నేతలతో ఉత్కంఠ గురవుతున్నారు. ఎంపి సీటు ఏం అవుతుందోనన్న ఆందోళన కనిపిస్తుంది. వైసిపి నుంచి ఇప్పటికే ముగ్గురు ఎంఎల్‌ఎలు సస్పెండ్ అయ్యారు. మరి కొందరు ఎంఎల్‌ఎలు, నేతలు క్యూలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. బాబు..నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు..

- వలస నేతలతో వెయిట్ జాబితా
- నేడు చంద్రబాబురాక
- 35 నియోజకవర్గాల సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తెలుగుదేశం పార్టీలో 2024 సాధారణ ఎన్నికల జోష్ అప్పుడే కనిపిస్తుంది. ఇటీవల జరిగిన తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆపార్టీ ఊహించని విజయం సొంతం చేసుకుంది. కడపలో టిడిపి అభ్యర్థి మెజార్టీ సాధించడంతో జోన్-4 సమావేశానికి నగరంలో ఏర్పాటు చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి కాలేజీ ప్రాంగంలో భారీ ఏర్పాట్లు చేశారు. కడప, ప్రకాశం, తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలోని 35 అసెంబ్లీ నియోజకవర్గాలలోని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పొలిట్‌బ్యూరో, రాష్ట్ర కమిటీ, జిల్లా నాయకత్వం, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి అభ్యర్థులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. సాయంత్రం 5గంటల వరకు సాగనుంది. విజయవాడ నుంచి రోడ్డు మార్గాన చంద్రబాబునాయుడు మధ్యాహ్నం 2 గంటలకు ఇక్కడకు చేరుకుంటారు. నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, బాదుడే బాదుడు.. ఓట్లు జాబితా సవరణ, కార్యకర్తలపై దాడులు, కేసులు ఇలాంటి కీలకమైన అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.



చంద్రబాబు సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న టిడిపి నేతలు

గురువారం సాయంత్రం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అజీజ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సీనియర్ నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాజా నాయుడు, బొమ్మి సురేంద్ర ఏర్పాట్లు పరిశీలించారు. ఇటీవల టిడిపిలో చేరిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సభావేదిక పరిశీలనకు వచ్చి ఆపార్టీ సీనియర్ నేతలను కలిశారు. అందరిని పలకరించారు.

ఉత్సాహం..ఉత్కంఠ..!

టిడిపి నేతల్లో ఓ వైపు ఉత్సాహం వెల్లువెరిస్తుండగా, మరో వైపు వైసిపి నుంచి వస్తున్న నేతలతో ఉత్కంఠ నెలకొంది. మూడున్నరేళ్లు ..ఆయా నియోజకవర్గాలో పనిచేస్తూ, తనదే టికెట్‌అని ఆశపడుతున్న నేతలకు ఆందోళన కలిగిస్తోంది.. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎవరువచ్చినా పార్టీలోకి ఆహ్వానిస్తామని ఆపార్టీ అధిష్టానం చెబుతోంది. విజయమే లక్ష్యంగా టిడిపి పావులు కదుపుతోంది. అందుకే వచ్చే ముఖ్యనేతలను పార్టీలోకి ఆహ్వానిస్తుంది. నెల్లూరు జిల్లాలోని ఆరు నియోజ కవర్గాల్లో వైసిపి అసంతృప్త సెగలు రగులుతున్నాయి. ఇప్పటికే నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ, వెంకటగిరి ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలకు పార్టీలో చేరడం, టికెట్ ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేరు వినిపిస్తోంది. ఇదే కాకుండా మరో ఇద్దరు అధికారపార్టీ ఎంఎల్‌ఎలు టిడిపితో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యనేతలు టిడిపి టచ్‌లోకి వస్తున్నారని, ప్రచారం సాగుతోంది.ఇది ఓ వైపు ఉత్సాహం కలిగిస్తున్నా మరో వైపు వలస నేతలు వస్తే, తమ నాయకులకు టికెట్‌వస్తుందా లేదా అనే ఉత్కంఠ నేతలు, కార్యకర్తల్లో నెలకొంది. ఏదేమైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం 2024 ఎన్నికల్లో టిడిపి గెలవాలని, అందుకు త్యాగాలు చేయాల్సి వస్తుందని చంద్రబాబునాయుడు ఇప్పటికే చెప్పినట్లు తెలిసింది. జరుగుతోన్న పరిణామాలు ఆపార్టీని ఆందోళనకు గురిచేస్తున్నాయి.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రజలకు పోషకాహారంతోపాటు మత్స్యకారులకు ఉపాధి మార్గాలను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యకారులకు జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తో కలిసి ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మత్స్యకారులకు అన్ని విధాల అండగా నిలుస్తూ, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మినీ ఫిష్ అవుట్లెట్లు ఏర్పాటు, మత్స్య సంపదను మార్కెటింగ్ చేయుటకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మత్స్యకారులకు మత్స్య సంపదను తరలించుటకు, విక్రయించుటకు వీలుగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అందజేస్తున్న ఈ వాహనాలను ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీతో ఈ వాహనాలను అందిస్తున్నట్లు చెప్పారు. తొలుత ద్విచక్ర వాహనాలు 18, ఒక త్రిచక్ర వాహనం, మూడు లైవ్ ఫిష్ వెండింగ్ వాహనాలను మంత్రి చేతుల మీదుగా మత్స్య కారులకు అందజేశారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, జడ్‌పి సిఈఓ చిరంజీవి, ఏడి ప్రసాద్, మత్స్య శాఖ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

'జలదీక్ష' భగ్నం చేయడం సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజా సమస్యలను పలుమార్లు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో జలదీక్ష పేరుతో పోరాటానికి రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సిద్ధపడితే దానిని పోలీసులు భగ్నం చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. గురువారం మాగుంట లే అవుట్ ప్రాంతంలో రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నివాసం వద్ద చేపట్టిన దీక్షా శిబిరం వద్దకు సిపిఎం జిల్లా నాయకులు చేరుకొని తమ సంఘీభావం తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ పొట్టే పాళెం కలుజు వద్ద బ్రిడ్జి నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వాన్ని కోరారన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన కానరాకపోవడంతో 'జల దీక్ష' పేరుతో ప్రభుత్వానికి నిరసన తెలియజేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఈ దీక్షకు అన్ని రాజకీయ పార్టీల నుంచి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారన్నారు. సిపిఎం సంఘీభావం తెలియజే యాలని భావించిం దన్నారు. పొట్టేపాళెం కలుజు ప్రాంతంలో వరద నీరు ఉధృతంగా ప్రవహించే సమయంలో అనేక మంది ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. ప్రమాద తీవ్రతను గుర్తించిన సిపిఎం ఇప్పటికే పలు మార్లు ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలంటూ ఆందో ళనలు చేయడమే కాకుండా జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభిం చాలంటూ రూరల్ ఎంఎల్‌ఎ చేపట్టిన పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రాజకీ య పార్టీలు చేసే ప్రజా పోరా టాలను అణిచి వేసేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

'కోటంరెడ్డి' గృహ'దీక్ష'..!

జలదీక్ష పోలీసుల భగ్నం - ప్రతిపక్షాల సంఘీభావం

నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన జలదీక్షను పోలీసులు భగ్నం చేశారు. గురువారం తెల్లవారుజామున 4 గంటలకే మాగుంట లేవుట్‌లోని శ్రీధర్‌రెడ్డి నివాసాన్ని పోలీసులు దిగ్బంధనం చేశారు. పొట్టేపాలెం కలుజు వద్ద పోలీసులు మోహరించారు. ఎక్కడికక్కడ నేతలు, కార్యకర్తను అడ్డుకున్నారు. ఎంఎల్‌ఎని ఇంటి నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. ఆయన అక్కడే ధర్నా చేసి, ఇంట్లో దీక్ష చేపట్టారు. తెల్లవారు జామున 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన గృహ దీక్ష చేపట్టారు సిపిఎం, టిడిపి, కాంగ్రెస్, జనసేన, సిపిఐ, ముస్లింలీగ్ పార్టీలు సంఘీభావం తెలిపారు. ఈనెల 13 నుంచి మరో పోరాటం చేపడుతామని శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన జలదీక్ష కాస్త గృహదీక్షగా సాగింది. నెల్లూరు రూరల్ నియోకవర్గంలోని సమస్యల పరిష్కారం , పొట్టేపాళెం కలుజు నిర్మాణం చేపట్టాలని గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు జలదీక్ష చేపట్టాలని నిర్ణయించారు. పోలీసుల అనుమతి కోసం లేఖ రాశారు. గురువారం తెల్లవారుజామున మాగుంట లేవుట్‌లోని శ్రీధర్‌రెడ్డి నివాసానికి పోలీసులు చేరుకున్నారు. జలదీక్షకు అనుమతి లేదని చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎప్పుడో అనుమతి కోరితే చెప్పకుండా ఇప్పుడు ఇలా చేస్తారా అంటూ పోలీసులను నిలదీశారు. అనుమతి ఇవ్వకపోయినా నేను దీక్ష చేపడుతానని చెప్పారు. అప్పటికే నాయకులు, కార్యకర్తలు అక్కడకు చేరుకోవడంతో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. నెల్లూరు డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మేయర్ స్రవంతి వాహనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రికత్త నెలకొంది. ఎంఎల్‌ఎ ఇంటి ముందే కూర్చొని ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన ఇంట్లోనే గృహదీక్ష చేపట్టారు. ప్రజా సమస్యలపై వెనక్కితగ్గేదిలేదని, స్పష్టం చేశారు. ఈనెల 13 నుంచి మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఆయన దీక్ష విరమించారు. ఆయన సోదరులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని ఎంఎల్‌ఎ దీక్షకు మద్దతు తెలిపారు.



దీక్ష చేస్తున్న ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రతిపక్షాల సంఘీభావం

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన దీక్షలకు వైసిపి మినహా అన్ని రాజకీయపార్టీలు సంఘీభావం తెలిపారు. సిపిఎం, సిపిఐ, జనసేన, కాంగ్రెస్, టిడిపి, ముస్లింలీగ్ ఇతర ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కె. అజయ్‌కుమార్, చంద్రరాజగోపాల్ , ఎంఎల్‌ఎను కలిశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం తమ మద్దతు ఉంటుందని తెలిపారు. టిడిపి నేతలు వేమిరెడ్డి పట్టాభి, ధర్మవరపు సుబ్బారావు, బి. రవీంద్ర, జనసేన నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి దామ అంకయ్య , ముస్లింలీగ్ నేత సయ్యద్ సమీతోపాటు కార్పొరేటర్లు, ఇతర నేతలు పెద్ద ఎత్తున తరలొచ్చి ఎంఎల్‌ఎకు సంఘీభావం ప్రకటించారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని భీమవరం సచివాలయం (2) పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి ఉలవపాడు మండల ఎంపీపీ వాయల మస్తానమ్మ, వైఎస్ ఎంపీపీ సయ్యద్ ఫజల్, జడ్పిటిసి అరుణమ్మ, భీమవరం సర్పంచ్ మేడిద రాజమ్మ, ఎంపిటిసి దాసరి రమణయ్య, ఉలవపాడు మండల జేసిఎస్ కన్వీనర్ వెలిచెర్ల ధనకోటి, ఉలవపాడు మండల కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా పాల్గొన్నారు.



11 నుంచి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -ఉలవపాడు : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని చాకిచెర్ల, శ్రీనగర్‌లో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ కబడ్డీ పోటీలు నిర్వహిం చనున్నట్లు జువ్విగుంట యలమంద తెలిపారు. విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. 9వ తేది లోపల టీం పేరును నమోదు చేయించుకోవాలని కోరారు. ఎంట్రీఫీజ్ రూ.500 ఉంటుందన్నారు.

కూలి డబ్బులు ఇప్పించరూ..!

ప్రజాశక్తి -గుడ్లూరు : ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలి డబ్బులు గత ఏడాది నుంచి ఇవ్వలేదని ఇప్పటికైనా ఇప్పించాలని గుడ్లూరు మండలం అడవి రాజుపాలెం గ్రామానికి చెందిన దేశ బోయిన భాస్కరరావు మరి కొంతమంది కూలీలు అధికారులకు గురువారం విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది మామిడి తోటలో చెట్లకు పాదులు చేసి గుంతలు తీసి ఏడాది గడిచిపోయిన ఇంతవరకు కూలి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసు అందజేత

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని కరేడు ర్యాంపులోని పిటీపీ ఫ్యాక్టరి కార్మికులకు ఈ నెల 1వ తేదీ నుంచి జిఒ నెంబర్ 123 ప్రకారం కనీస వేతనం రూ.400లు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిటిపి స్టాఫ్, వర్కర్స్ యూనియన్ (సిఐటియూ) ఆధ్వర్యంలో గురువారం యాజమాన్యానికి చార్టర్ ఆఫ్ డిమాండ్ నోటీసు అందజేశారు. యూనియన్ అధ్యక్షులు జివిబి కుమార్, ఆఫీస్ బేరర్లు చిమటా శ్రీనివాసులు, సవరం శ్రీనివాసులు, గంజి శ్రీనివాసులు, ఉమ్మడిప్రోలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



నిబంధనలు పాటించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి -వెంకటాచలం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పగిడిపోగు కిరణ్ కిషోర్ కోరారు. మండలంలో కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఒంటి పూట బడి నిర్వహిం చకుండా అందుకు విరుద్ధంగా సాయంత్రం వరకు విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి ప్రభుత్వ నిబంధనలకు నడపుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గృహసారధులకు సూచనలు

ప్రజాశక్తి -కందుకూరు

స్థానిక 9వ సచివాలయంలోకన్వీనర్లు, గహసారధులు అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. కందుకూరు పట్టణ జేసిఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇంటి ఇంటికి వెళ్లి వివరించి ప్రజామద్దతు కూడగట్టాలన్నారు. నేటి నుంచి జరిగే జగనన్న నువ్వే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. జనార్ధన స్వామి దేవాలయం చైర్మన్ రావులకోల్లు బ్రహ్మానందం మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ దేవరకొండ ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మాట్లాడారు. లో కన్వీనర్లు నిడమనూరి రమేష్, షేక్ హాఫీజ్, చనమాలకోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కరిమూనిషా, రాష్ట్ర యువజన కార్యదర్శి గణేషం గంగిరెడ్డి, గహసారధులు, వాలంటీర్లు ఉన్నారు.

'కోటంరెడ్డి' జలదీక్షకు అనుమతి లేదు..

డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జలదీక్ష చేస్తే ప్రాంతంలో ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా దీక్ష చేపట్టడం ప్రమాదకరమని రూరల్ డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని రూరల్ డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పొట్టేపాళెం కలుజు ప్రాంతంలో జలదీక్ష చేపట్టేందుకు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుమతివ్వాలని పోలీసు శాఖను కోరారన్నారు. జలదీక్ష చేసే రహదారి మీదుగా పది పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులు ప్రయాణించే అవకాశం ఉందని, దీక్ష చేపట్టడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఎర్పడి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారన్నారు. జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెం, నరసిం హకొండ పశ్చిమ ప్రాంత గ్రామాలకు ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించే ప్రజలు ట్రాఫిక్ అంతరాయం ఎర్పడుతుందన్న కారణాలతో జలదీక్షకు అనుమతులు పోలీసు శాఖ ఇవ్వలేదన్నారు. వాస్తవానికి జలదీక్ష చేసే సమయంలో ఎంత మంది ఆ ప్రాంతానికి వస్తారో స్పష్టత ఇవ్వలేదన్నారు. జలదీక్ష నిర్వహించే సమయంలో ఆప్రాంతానికి చేరుకున్న ప్రజలు చెరువుగట్టుపైకి ఎక్కితే ప్రమాదవశాత్తు జారి పడిపోతే ప్రాణనష్టం ఏర్పడుతుందన్నారు. ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటే ప్రజలను రక్షించేందుకు గజ ఈతగాళ్ల ఎంత మందిని సిద్ధం చేసుకున్నారు.. ఎంత మందికి లైఫ్ జాకెట్స్ అందజేశారు.. మరబోట్లు ఎన్ని సిద్ధం చేశారో సమాచారం అందజేయలేదన్నారు. జల దీక్ష చేపట్టే సమయంలో ఆ ప్రాంతంలో జరిగే అవాంఛనీయఘటనలకు బాధ్యత వహిస్తున్నట్లు ధృవీకరించలేదన్నారు. ఎంఎల్‌ఎ వయస్సు రీత్యా, ఆరోగ్య రీత్యా ఈ దీక్షలకు అనుమతులు ఇవ్వలేదన్నారు.



డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి

కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని మండలంలోని పొట్లపూడి, విలుకానిపల్లి, సౌత్ ఆము లూరు, చింతోపు, ముంగలదొరువు, పేడూరు గ్రామాల్లో సమావేశాలు జరిగాయి. సచివాలయాల పరిధిలో గురువారం కన్వీనర్లు, వాలంటీర్లు, గహ సారధులతో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి, సర్పంచ్, సచివాలయాల ఇంచార్జ్, తలమంచి సురేంద్ర బాబు గురువారం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు సురేంద్ర బాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసీపీ భారీ మెజారిటీ కోసం కషి చేయాలని కోరారు. అనంతరం వాలంటరీలకు, గహ సారథుల కు "మా నమ్మకం నువ్వే జగన న్న" అనే కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయ డైరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ సమా వేశంలో సర్పంచ్ చెరుకూరి సరళమ్మ, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, ఉదయ్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

నేడు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రపంచ ఆరోగ్య సంస్థ 76వ వార్సికోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు క్రీడా మైదానం నుంచి ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వాక్తాన్ వాకర్స్ ఇంటర్నేషనల్ 2022 అధ్యక్షులు వి.నేతాజీ సుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. ఈ ర్యాలీ వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ,మూఢ నమ్మకాలు ,పర్యావరణం ,జీవావరణం, ఆరోగ్య వ్యవస్థలు ,సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలు మానవుని ఆరోగ్యం పై ప్రభావం చూపుతు న్నాయన్నారు. వాకర్స్ జిల్లా గవర్నర్ వాకర్ ఎం. వెంకటాద్రి రెడ్డి ఎలక్ట్ గవర్నర్ వాకర్స్ పి. శ్రీనివాసులు రెడ్డి వాకర్స్ ఇంటర్నేషనల్ 2022 కోశాధికారి వాకర్ ఎన్. బలరామయ్య నాయుడు వాకర్ డి.పార్థసారధి రెడ్డి వాకర్ ఎస్.జయరామిరెడ్డి, వాకర్ రమేష్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి : సిపిఐ

ప్రజాశక్తి-నెల్లూరు

బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, ఈ విధానాలను ప్రశ్నించిన వారిపై ఈడి, సిబిఐ శాఖలతో దాడులు చేయించి కేసులు నమోదు చేయడం, దేశ సంపదను గుజరాత్‌కు చెందిన అంబానీ, అధాని వంటి కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను ప్రజలకు తెలియజేసి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ పిలుపు నిచ్చారు. గురువారం ఆయన నగరంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కార్పోరేట్ శక్తులు జాతీయ బ్యాంకులలో తీసుకున్న రుణాలను మాఫీ చేసి బ్యాకింగ్ వ్యవస్థను దివాలా తీసే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుం దన్నారు. కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేపట్టిన నాటినుండి దేశంలో రాజ్యాంగ యొక్క విలువలు పూర్తిగా విస్మరించిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కడుతూ 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రతి మండలము లోని గ్రామ గ్రామాన ప్రజలకు తెలియజేస్తూ విస్తతంగా ప్రచారం చేపట్టాలని పిలుపు నిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనలో దేశ సంపదనంతా గుజరాత్ రాష్ట్రంలో చెందిన కార్పొరేటర్ శక్తులకు అప్పగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సిపిఐ ప్రచార ఆందోళనలను జయప్రదం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేంద్ర సాయి, మాల కొండయ్య, సురేష్, సిరాజ్,మధు, నంది పోగుల రమణయ్య, షాన్వాజ్, నందయ్య, యాట సీనయ్య, ఉన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు

రాష్ట్రవ్యాప్తంగా గురువారం ప్రారంభమైన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా కోవూరులో జరిగిన ప్రారంభోత్సవంలో కోవూరు గ్రామ సర్పంచ్ ఆవుల మాధవరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ స్వాతి, హెచ్‌వి సుశీల, ఎఎన్‌ఎం ఎస్తేర్ రాణి, సుమతి, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్‌లు గోవిందరెడ్డి, శ్రీధర్ బాబు, అశా కార్యకర్తలు శోభాకుమారి, రజని పాల్గొన్నారు.

గుడ్లూరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మండలంలో ఏలూరుపాడులో డాక్టర్ సాయి ప్రియాంక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. డిప్యూటీ టిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రియంవదనం ఏలూరుపాడు, పి హెచ్‌సిలను సందర్శించి ఈ కార్యక్రమం అమలును పర్యవేక్షించారు. ఏలూరు పాడులో సర్పంచ్ స్వర్ణ చెన్నమ్మ ,గ్రామ నాయకులు పాల్గొన్నారు. చిన్నలాటరీపీలో గ్రామంలో డాక్టర్ మారుతీ రావు ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉలవపాడు : మండలంలోని భీమవరంలో ఫ్యామిలీ డాక్టర్ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలతో ప్రతి గ్రామానికి గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగామ్‌ను ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ల బందం పాల్గొన్నారు.



'ఆసరా' నిధులు జమ

ప్రజాశక్తి -కందుకూరు : రాష్ట్రంలో ఉన్న డాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మూడో విడత వైయస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి గురువారం చెప్పారు. కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో 3వ విడత ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఎల్‌ఎ మహీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నాటికి ఉన్న బకాయిలను నాలుగు సార్లు చెల్లించి మాఫీ చేస్తానని ఇచ్చిన మాట మేరకు మూడోసారి చెల్లించినట్లు తెలిపారు. మహిళలపై ఉన్న నమ్మకంతో రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక పథకాలలో వారిని లబ్ధిదారులుగా చేర్చి ఉపయోగపడే విధంగా ఆర్థిక పరిపుష్టిని కలిగిస్తున్నాడని చెప్పారు. రుణమాఫీ చెక్కును సభ్యులకు అందజేశారు. జిల్లా మెప్మా పీడీ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



'టిసిఎస్'లో ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -కందుకూరు : కార్పొరేట్ రంగంలో ఈ ఏడాది ఉద్యోగ నియామకాల సంక్షోభం నెలకొని ఉన్నా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు పలువురు టి.సి.ఎస్‌లో ఉద్యోగాలకు ఎంపికైన తమ ప్రతిభను చాటుకున్నారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, సాంకేతిక డైరెక్టర్ డాక్టర్ కే.విజయ శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. టిసిఎస్‌తోపాటు డిలాయిట్ కంపెనీకి కూడా ఒక విద్యార్థి ఎంపిక కావడం తమ కాలేజీ సమర్థతకు తార్కాణమన్నారు. టిసిఎస్‌కు ఎంపికైన వారిలో ఒక విద్యార్థి రూ. 7 లక్షల వార్షిక వేతనం క్యాటగిరిలో ఉండడం తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. తొలి విడతలో 15 మంది టిసిఎస్‌కు ఎంపిక కాగా, మరో 10 మంది విద్యార్థులు వివిధ దశల అనంతరం ఫైనల్ గా ఎం.ఆర్ ఇంటర్వ్యూ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ పేర్కొన్నారు. సంక్షోభ నివారణ ముగిసిన అనంతరం పలు సాఫ్ట్వేర్ కంపెనీలు ఉద్యోగాలు ఎంపికకు రంగ ప్రవేశం చేసే అవకాశాలు దక్కించుకునేందుకు ప్రణాళిక రూపొందించామని వారు వెల్లడించారు. టెక్నికల్ సపోర్ట్ జాబ్స్‌కు క్యాంపస్ ఇంటర్వ్యూల నిర్వహణ రంగ సిద్ధం చేస్తున్నామన్నారు. విప్రో,ఇన్ఫోసిస్, కేప్ జెమినీ తదితర కంపెనీల త్వరలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.





మాట్లాడుతున్న మహీధర్‌రెడ్డి

' నేటి నుంచి 'జగనన్న నువ్వే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో నేటి నుంచి జరిగే జగనన్న నీవే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం మహీధర్ రెడ్డి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి. సంతప్తికరంగా ఉన్నారా లేదా అనే విషయాన్ని తెలుస ఒకోవడానికి ఇంటింటికి గహసారథలు, కన్వీనర్లు తిరుగుతారని చెప్పారు. ప్రజలు ఇచ్చిన సమాధానాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. వైసిపి నేతలు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి

శనగల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ వీరిచలపతి రావు ప్రారంభించారు. గురువారం ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని దుత్తలూరులో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని అన్నారు. రైతన్నలకు అండగా నిలిచేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు వేసే ప్రతి పంటను కొనుగోలు చేసి దళారీ వ్యవస్థను అరికట్టి రైతు కుటుంబానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చలమా రెడ్డి, డిసి ఎంఎస్ బి ఎం.వెంకట స్వామి, డైరెక్టర్ ఖిల్జీ సలీమ్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు సుభాని, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు 'వంటేరు'పరామర్శ

ప్రజాశక్తి-జలదంకి

కావలి మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాల్ రెడ్డి గురువారం జలదంకి మండలంలో ముమ్మరంగా పర్యటించారు. చిన్న క్రాక వైసీపీ నేత గోసల శివకుమార్ రెడ్డి తండ్రి ఉత్తర క్రియల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జలదంకి మండలం తెలుగు యువత మాజీ అధ్యక్షులు కూరపాటి సుధాకర్ రెడ్డి తండ్రి కూరపాటి రమణా రెడ్డి ఇటీవల మృతిచెందారు.కొత్తపాలెం వైసిపి నాయకులు చేరెడ్డి మస్తాన్ రెడ్డి, బిజ్జం ఎరుకల్ రెడ్డిలని కలిసి మాట్లాడారు..


మృతుల కుటుంబాలతో మాట్లాడుతున్న వంటేరు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి మన ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పేర్కొన్నారు.గురువారం ఆత్మకూరులోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్, వీడియో క్లిప్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించాలన్నారు.ప్రతి ఇంటికీ సచివాలయ కన్వీనర్లు, గహసారథులు వెళ్లి ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. పథకాలు పొందిన లబ్ధిదారులు సంతప్తిగా ఉన్నారా లేదా, ప్రభుత్వంపై ప్రజల స్పందన తప్పక నమోదు చేయాలని సూచించారు. ప్రజల్లోకి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు ప్రతి ఒక్కరూ విస్తతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం నువ్వే మా నమ్మకం జగనన్న కిట్లను అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఎంపీపీ కేత వేణుగోపాల్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు కామాక్షయ్య నాయుడు, షేక్ మహబూబ్ బాషా, శివ కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేనేజర్‌కు ధన్యవాదాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-వరికుంటపాడు

బస్సు సౌకర్యం కల్పించిన డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ చిరంజీవిరావుకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. పదవ తరగతి పరీక్షల సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆవేదం వ్యక్తం చేశారు. మండలంలోని వింజమూరు, కొండాయపాలెం, పెద్దపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు వందమంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కావలసి ఉంది. దీంతో విద్యార్థులు ఆటోలపై ఆధారపడి ఒక్కొక్కరు రూ.100 చెల్లించి పరీక్షా కేంద్రాలకు హాజరవుతున్న క్రమంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రజాశక్తి దష్టికి తేవడంతో వెంటనే డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ చిరంజీవి రావు స్పందించారు. విద్యార్థుల సమస్యలు దష్టిలో ఉంచుకొని వెంటనే బస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తల్లితండ్రులు సమస్య విన్న వెంటనే పరిష్కారం చూపిన చిరంజీవిరావు కు ధన్యవాదాలు తెలిపారు.




మాట్లాడుతున్న ఎంపిడిఒ

త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

: నుడా జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆత్మకూరు ఎంపీడీఓ సి. శ్రీనివాసులు తెలియజేశారు. గురువారం ఆయన సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మండలంకు 599 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో కేవలం 288 ఇళ్లకు మాత్రమే జియో టాగ్ చేశారని, మిగతా 311 ఇళ్ల లబ్ధిదారులకు జియో టాగ్ చేయాలన్నారు. ఇళ్ల లబ్ధిదారులను ప్రోత్సహించి వారు త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో హౌసింగ్ ఇంజినీరు ఉదయ భాస్కర్, సహాయకులు శరత్ కుమార్, కంప్యూటర్ సహాయకులు లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు వాసి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి. పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని తూర్పు వీధిలో ఉన్న పాత , కొత్త మసీదులలో 300 మందికి ఇఫ్తార్ విందు అందించారు. ఈ ప్రాంతంలో తాను చిన్నప్పటి స్నేహితులు తన క్లాస్మేట్స్ ఉన్న ప్రాంతం కావడం వారందరినీ కలిసినట్టుగాను రంజాన్ మాసంలో వారికి ఇఫ్తార్ విందు ఇచ్చినట్టుగా ఉంటుందని ఉద్దేశంతో ఇక్కడికి వచ్చినట్టు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.. వీరి వెంట వారి సన్నిహితులు స్నేహితులు హాజరయ్యారు. ఇఫ్తార్ ప్యాకెట్స్ అందించిన అనంతరం అక్కడే వారితో పాటు కలిసి భుజించి వారిని ఆలింగనం చేసుకొని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.. ఇఫ్తార్ అందించిన పరమేశ్వర్ రెడ్డికి ఆ అల్లా దయ కప ఉండాలని ఇక్కడి మతపెద్దలు ఆశీర్వదించారు.



వైద్యసేవలందించడమే ధ్యేయం


మర్రిపాడులో

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఫ్యామిలీ ఫిజిషియన్ ముఖ్యోద్దేశమని కష్ణాపురం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వంశీకష్ణ సుమన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 104 వాహనానికి స్థానిక సర్పంచ్ మంచాల హరిబాబు, మండల ఉపాధ్యక్షురాలు పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి వంశీకష్ణ సుమన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారన్నారు.గ్రామాలలో వద్దులు, వికలాంగులు, ఇతర రోగులకు ఇళ్ల వద్ద వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు జనరల్ చెకప్ రక్తహీనత నివారణకు పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. బీపీ, షుగర్ ఉన్నవారికి ప్రతిరోజూ చెకప్ చేస్తారన్నారని, గర్భిణులు, బాలింతలకు హెల్త్ చెకప్ చేస్తారని తెలియజేశారు. పిల్లల్లో ఎదుగుదల పౌష్టికాహార లోపాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్ గ్రామానికి వెళ్లి రోజంతా అక్కడే ఉండి ప్రజలకు వైద్య సేవలు అందజేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సిద్ధం రెడ్డి మోహన్ రెడ్డి, వైసీపీ యువ నాయకులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, శ్రీధర్ రెడ్డి మీరావలి, సిహెచ్ఒ రోసిలిన్, మండల విస్తరణ అధికారి కొండారెడ్డి, జావిద్, సూపర్‌వైజర్లు సైదా, ఎస్‌కె ఖాజా మొహిద్దిన్, మాజీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి, ఎంఎల్ హెచ్పీలు, ఎఎన్ఎంలు, ఫైలెట్ మస్తాన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విస్తతంగా వైద్య సేవలు అందిస్తుందని ఎంపీపీ కుమారి, దర్శి గుంట శశిరేఖ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇందుపూరు గ్రామంలో ఆ వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వాహనాలను ప్రారంభించడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఒక గ్రామానికి వైద్య బందం విచ్చేసి వివిధ పరీక్షల అనంతరం మందులను పంపిణీ చేస్తారని తెలియజేశారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి అనేక సలహాలు సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు కోడూరు సాధక్ కుమార్ రెడ్డి సహకారంతో ఈ గ్రామానికి విచ్చేయడం జరిగిందన్నారు. మండల కన్వీనర్ దండా కష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల కోసం ఎనలేని కషి చేస్తున్నారని అందులో భాగంగా 104 వాహనాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సహకారాలు మనకు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర, డాక్టర్ నవీన్ కుమార్, సూపర్వైజర్ పందల క్రిష్ణయ్య, వైసిపి నాయకులు దర్శిగుంట వెంకయ్య, సర్పంచ్ రెహనా బేగం, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు..


అల్లూరులో

కలిగిరి

వైద్యం,విద్యా రంగాలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి కొనియాడారు.స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య సదుపాయాలు అందించే ప్రత్యేక వాహనాన్ని ఎంపిపి మెట్టుకూరు శిరీషారెడ్డి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్టుకూరు దంపతులు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ వైద్యుడు(ఫ్యామిలీ డాక్టర్)విధానం రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన అంశమన్నారు.కార్యక్రమంలో స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు పాలూరి మాల్యాద్రి రెడ్డి, వైద్యశాల ప్రధాన వైద్యులు డాక్టర్ గీతారెడ్డి, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కలిగిరిలో

కావలి

కావలి రూరల్ మండలం చరంచర్ల గ్రామంలో సచివాలయంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు ప్రారంభించారు
తదుపరి 104 అంబులెన్స్ రిబ్బన్ కటింగ్ చేసి వారిద్దరూ ప్రారంభించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ లు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కి,ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి బిపి,షుగర్ టెస్ట్ లు చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గెలిచిన తర్వాత మొట్టమొదటిసారిగా మన నియోజకవర్గానికి విచ్చేసి, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ ఆలూరి కొండమ్మ, వైసిపి మాజీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివ కుమార్ రెడ్డి, చలం చర్ల సర్పంచ్, రాష్ట్ర గౌడ్ సంఘ డైరెక్టర్ నాయుడు రాంప్రసాద్, శ్రీహరి నాయుడు, కొత్తపల్లి సర్పంచ్ చిమిలి శ్రీహరి, వైసిపి నాయకులు కుందుర్తి కామయ్య , దాంశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, పరుసు మాల్యాద్రి ,కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కావలిలో


సంగం

మండలంలోని కొరిమెర్ల గ్రామంలో డాక్టర్ ప్రతిమ వైసిపి నాయకులతో కలిసి ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 104 వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. మండలంలోని ప్రతీ సచివాలయంలో రెండు రోజులు ప్రజలకు అనేక రకాల వైద్య సేవలందిస్తామని చెప్పారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు రఘునాథ్ రెడ్డి,ప్రసాద్, కరీముల్లా, మల్లికార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఊసరవెల్లి రాజకీయం చంద్రబాబుకే సాధ్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఊసరవెల్లి రాజకీయం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఘాటు విమర్శలు గుప్పించారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తూరు కోపరేటివ్ బ్యాంక్ ఆవరణలో ఉన్న నూతన ఎరువుల గోడౌన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ కాలనీలో ఆయన పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ప్రతి గడపగడపకు వెళ్లి దమ్ము ధైర్యం ఉన్న ఒకే ఒక్క పార్టీ వైఎస్ఆర్ పార్టీ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిల్లర రాజకీయాలు చేస్తూ, ఊసరవెల్లి రాజకీయం చేయడాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా అన్ని వర్గాల ప్రజలకు సమన్వయం చేసిన ఘనత తమనాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.కార్యక్రమంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర పశుగణాభివద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ యాదవ్, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, వైసిపి నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి, వివిధ గ్రామాల వైసీపీ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రసన్నకుమార్‌రెడ్డి

మిషన్ వాత్సల్య అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి ఇందుకూరుపేట

మండలంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ హేనా సుజన్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్ వాడీ కార్యకర్తలు, ఇందుకూరుపేట, టి.పి. గూడూరు, నెల్లూరు రూరల్ మండలాల్లోని మహిళా పోలీసులకు స్పాన్సర్ షిప్ మిషన్ వాత్సల్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ హేన సుజన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం మహిళా అభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్ షిప్ ప్రోగ్రామ్ ద్వారా నిరాధారణకు గురైన బాలలకు వారి విద్య, ఆరోగ్య అభివద్ధి అవసరాలకు ఉపయోగ పడే విధంగా ఆర్థికంగా ఆదుకోవడానికి వారి కుటుంబపు ఆర్థిక పరిస్థితి అనుగుణంగా షరతులతో కూడిన ఆర్థిక సహాయం అందించుట జరుగుతుందనీ తెలిపారు. అదేవిధంగా అంగన్ వాడీ కార్యకర్తలు, ఎమ్మెస్ కే లను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ పథకంలో 3 మండలలోని అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయినవారు, తల్లిదండ్రులు దూరమైన వారు తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు , తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారు పేదరికంతో ఇంటి యజమానిని కోల్పోయినవారు అంగవైకల్యం కలిగిన పిల్లలు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూరల్ ఏరియాలో రూ.72,000/- , మున్సిపల్ ఏరియాలో రూ.92,000/- కంటే తక్కువ ఉన్న వాళ్ళను గుర్తించి సంబధించిన అప్లికేషన్ లను స్వీకరించాలన్నారు. సంబంధిత మండల కమిటీ ఆమోదం పొంది 15.04.2023 వ తేదీ లోపల ప్రాజెక్టు డైరెక్టర్ నెల్లూరు వారి కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సురేష్, ఎసిడిపిఒ ఎం.రాజ్యలక్ష్మి , ఐ.సి.డి.ఎస్ సూపర్‌వైజర్లు, ఎమ్మెస్‌కేలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిడిపిఒ హేనసుజన

కత్తులతో దాడి-ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-అల్లూరు:మండల కేంద్రం స్థానిక దళితవాడకు చెందిన చింటూ,ప్రణయ్ అనే వ్యక్తులు బుధవారం రాత్రి బైక్ పై వస్తూ ఉండగా బోగోలు మండలం కప్పరాళ్ల తిప్పకు చెందిన మల్లి శివాజి అల్లూరు ప్రాంతానికి చెందిన చక్రవర్తి, పర్యాని కార్తీక్ అలియాస్ సుబ్బు,సాయి అనే వ్యక్తులు 2 బైకులు పై వచ్చి కత్తులతో దాడి చేశారు. వెనుక వీపు వైపు మోచేతుల వద్ద గాయాలయ్యాయని ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు.ఈనెల 3న పాత బస్టాండ్ వద్ద చిన్న తోపులాట జరగగా అది మనసులో పెట్టుకుని దాడికి పాల్పడ్డారని ఈ మేరకు తగు పరిశీలించి కేసు నమోదు చేశామని వివరించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోళ్లు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రానికి దుత్తలూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 761పొగాకు బేళ్లను రైతులువేలం కేంద్రానికి తీసుకొచ్చారు.వీటిలో 693బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపా రస్తులు కొనుగోలు చేశారు.వివిధ కారణాలతో 58పొగాకు బేళ్లను తిరస్కరించారు. అధిక బరువుతో ఉన్న 10పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారు. వీటిలో ఎన్ ఎస్ 39ఎన్ బి10 సి ఆర్ 07బి ఆర్ 02ఉన్నాయి.కిలో పొగాకు గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.183 సగటు ధర 195.79న మోదు కాగా , వేలం లో 10మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొ న్నారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 1067 / 2019

Korapati Bhagya Lakshmi - Plaintiff

Vs

Velam Lakshmi Prasanna - Defendants

Notice to Defendant

Velam Lakshmi Prasanna, W/o **Dasaiah,** Residing at D.No. 26/1024, Near Bhagwan Sri Venkaiah Swamy Temple, Kesavulu Nagar, Vedayapalem, Nellore, SPSR Nellore District.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో ప్రమిసరీ నోటు బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తేది: 18-4-2023** న వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేనియెడల కేసు మీపరోక్షమున తీర్మానించబడును.

ఎ. రామచంద్రరాజు, బి.ఎ., బి.ఎల్.,
వాది తరపు న్యాయవాది, నెల్లూరు.

శ్రీ మహారాజ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : కందుకూరు

ఇ.పి.నెం.91/2021

ఓ.ఎస్.నెం.280/2019

బిట్వీన్:
దగ్గు గురుమూర్తి అలియాస్ **ఎర్రబ్బయ్య** - డి.హెచ్.ఆర్.
వర్సెస్
సామా శ్రీనివాసులు అలియాస్ **శ్రీనివాసు** - జె.డి.ఆర్.

నోటీసు

టు,
సామా శ్రీనివాసులు అలియాస్ **శ్రీనివాసు,** తండ్రి **సత్తెయ్య,** అన్నెబోయినపల్లి గ్రామం, లింగసముద్రం మండలం, ప్రకాశం జిల్లా, (ప్రస్తుతం నెల్లూరు జిల్లా.)

పై నెంబరు వ్యవహారములో మీరు జె.డి.ఆర్ అయివున్నారు. డి.హెచ్.ఆర్. మీపై పై కోర్టులో బాకీ రాబట్టుకొను నిమిత్తం మీపై ఇ.పి. పిటిషన్ దాఖలు చేసివున్నారు. పై కోర్టు వారు మీకు ఎన్నిసార్లు ఇ.పి. నోటీసులు పంపించినను మీకు జారీ కానందువలన శ్రీ పై కోర్టు వారు మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా జారీ చేయమని కోరుచూ పై కేసును **తేది: 10-04-2023** నకు వాయిదా వేసివున్నారు. కావున మీరు **తేది: 10-04-2023 ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు నందు స్వయముగా గానీ, లేక మీ తరపున న్యాయవాదిని కానీ హాజరుపడి పై పిటిషన్‌లో మీరు తెలుపుకొనవలసిన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై వాజ్యమును మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 10-04-2023

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వి.నాగరాజు
న్యాయవాది, గుడ్లూరు.